మన్నంత చిరాకు కల్గింది గాని ఆపిల్ల చాల పైఅంతస్థులో నుంది—పిల్ల బాగుందికూడ. మిగతా విషయాలు కావాలంటే ఇంట్లోని అదృష్టవంతుణ్ణడగాలి. ఈరోజుల పరిమాణం, పరిణామం చాల Fluctuations లో నున్నాయి. తెలియదు మరి...అందుకే అవకాశం, లేకుంటే ఆకాశం. దీపావళి దోహదమిస్తూంది వికల పరిభ్రమలకి.

శాంతి నివ్వనున్నశాలలో రోగి బాధతో మూల్గుతున్నాడు. మతాబాపొగకి తాతలు దగ్గుతున్నారు. దీపాలు స్మృతిని రగిల్చి బాధల్ని పెనవేసుకొని, మనస్సుల్ని కాల్చేస్తున్నాయి. ధారుఢ్యముడిగి, సంవత్సరాలతోపాటు చెడిన శరీరాలు పరారయిన పరాక్రమాన్ని తల్చుకుని నిట్టూరుస్తున్నాయి. వర్తమానంలో గతంయొక్క ప్రతిబింబం అంత వికృతంగా నుందేం! అద్దం బాగులేదా...లేక దీపాల పొగ కమ్మిందా?

చిచ్చుబుడ్డులు పువ్వుల్ని విరజిమ్ముతుంటే ఓయువకుడు మరో యువకుణ్ణడుగుతున్నాడు : "ఝంఝూప్రభంజానుసరమైన మేఘావృతగగనం ఆవేశం కలిగిస్తుందా, లేక వినిర్మలంగా తెల్లనివెన్నెలతో, నక్షత్రాలంకారమైన ఆకాశం ఆవేశమిస్తుందా?". జవాబుగా ఆ యువకుడు, అమావాస్యకప్పుకున్న నల్లని ముసుగుని చూపించేడు. గాని ఆకవిగారికి మిట్టమధ్యాహ్నం బస్సులో చూచిన కన్నెపడుచుమాత్రం మెదడులోనుండి జారిపోటంలేదు. నికృష్ట జీవులకి, నేరడిపండుకి కస ఎక్కువ — పాముబుసకు మల్లే...కోరలులేవుగాని వేళ్ళలోని ఎముకమాత్రం గట్టిది.

అన్నట్టు చెప్పడం మరచా...దీపావళి అంటే దీపాల గుంపు, వరుస ఏమనుకున్నాసరే, నేనుమాత్రం ఆమాటని అమావాస్యతో జోడించడం అంత బాగులేదంటాను. ఖద్దరు రూపానికి, బ్లాకుమార్కెట్టుకి సంబంధం కూర్చినట్లు-ప్లీడరు గారబ్బాయికి దాసిలచ్చికి వరుస కలిపినట్టు ... నేను నమ్మను...మిమ్మల్ని తృప్తిపరచేందుకు నమ్మేనన్నా ఏమి బాగులేదు ఆ జోడింపు. నెహ్రూకి షూటుకి అవినాభావ సంబంధం కూర్చినట్లుంటుంది. ఇంతకీ అమావాస్యనాడు దీపావళి ఓ Accident అంతే! హాయిగా ప్రయాణం చేస్తుంటే, పడవ మునిగిపోటంలే—ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు చూపెట్టి కోటీశ్వరులు కూడ టాక్సు ఎగవెయ్యటంలే—అంతే ఓ యాక్సిడెంటు. కావలంటే గుండ్రంగా నున్న ఆ ఢిల్లీభవనంలో గుండుబుర్రలవాళ్ళ నడగండి—లేకుంటే డాల్మియా నడగండి. ఏదో యాక్సల్ లేని చక్రం ఇంకా తిన్ననైన రోడ్లుపడాలి ఈప్రమాదాలు లేకుండా.

మొత్తానికి నే చెప్పేదేమంటే, దీపావళినాడు మేడ కిటికీ చువ్వల్ని ఆనుకునికూర్చుంటే మెదడు భరతనాట్యం చేస్తుందని, దరిద్రుడి బక్కపేగులు ఆడినట్లు లైలామజ్నూ చూస్తుంటే బెంగాల్ కరువు బుర్రలో పరుగెత్తటంలే! అలాగే ఇదీను. నేనూ ఆనాడు అలా కూర్చునుంటే ఎవరో తుంటరి ఒదిలిన తూరీగ తెల్లగా నవ్వుతూ వేడిగా నా జుత్తులోకి పోయింది. లెక్కపెట్టలేకపోయేను గాని నాకు తెల్సు కొన్ని విలువైన రేఖలు ఆహుతయ్యేయి. గతుక్కుమని కలలోని కులుకును, మెలకువలో పోలిక పట్టలేక చికాకుపడి 'కన్సొలేషన్' కోసం ఎదురింటి అజిలాబిపిల్లను మతాబా కాలుస్తుంటే చూడబొయ్యేను గాని పాడు పొగ మా ఇద్దరిమధ్య దట్టమైన తెరవేసింది.

దీపావళి అమావాస్యతో పోరాడుతూంది. దీపావళికా తారుపూత? రాత్రిలోని వెలుగుకు ఎందుకో అధికారం చెలాయించాలనే అతృష్ణ. పైకెగసే అదీపశిఖలకి, ప్రేమనిశితానికి ఏమా రక్తసంబంధం! హృదయంకాలుతోంది... మెదడన్నది లేకుంటే హృదయానికి ఈ ఘాతకముండదేమో, పైడాబాయెక్కి విశాలంగా చూచేను. నాలుగువైపులా దీపాలు చీకటితో కలహపడ్తున్నాయి...గాని అది అమావాస్య నడిరేయి...దీపాలు అలసిసొలసి సొమ్మసిల్లేయి—అమావాస్య ఆవరించుకుంది విజయగర్వంతో. గాని ఇంకా అక్కడక్కడ మూల్గులుమాత్రం వినవస్తున్నాయి. కాలి కిందపడ్డ కాలినపిచ్చుక అడిగింది. "ఇంకా నిద్రరావటంలే?" అప్పుడు తెలిసింది దీపావళి అంతలోనే అయిపోయిందని, ఇక మిగిలిన జాములు అమావాస్యవి.

---


## బాలసుధ

నేటి బాలపాపలే రేపటి పౌరులు.
బాలపాపలే దేశానికి సంపద.
వారి ఆరోగ్యమే దేశానికి ఐశ్వర్యం.

అట్టి బాలపాపల బలారోగ్యాన్ని పెంపొందించే మిఠాయి వంటి తియ్యని మందు. ఇది మలయాళ మూలికలచే తయారుచేయబడినది. దుర్బలులైనవారు మేహకాకచే బక్కచిక్కినవారు గజ్జి తీట గజ్జి అజీర్తి వాయువుతో పొడిదగ్గుతో మలబద్ధకంతో విరేచనాలతోనీటిచురుకుతో బాధపడు బాలబాలికలచే ఈమందు సేవింప చేయడంవల్ల ఆ వ్యాధులన్నీ నయమై వారు పుష్టితుష్టి పొంది బాగుగా యెదుగుదురు. ఎట్టి రుగ్మత లేనివారుకూడ దీనిని నిరభ్యంతరముగా



వాడవచ్చును. దీని సేవతవలన వారికి రక్తపుష్టి హెచ్చి జ్ఞాపకశక్తి పెంపొందును. చదువుకొను బాలబాలికల మెదడుకు రసాయనంగా వుంటుంది. 3 ఏళ్ల బిడ్డనుండి వాడవచ్చును.

టిన్ను 1-కి రు. 3—0—0

ధనలక్ష్మి అండు కో., సౌకారుపేట పోస్టు, మదరాసు